సాక్షి అనంతపురం

బుధవారం । 22 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.31 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.31 వేలు పలికాయి.



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.18, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.7.50 పలికింది.

గరిష్టం/కనిష్టం

37.1°/17.4°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం స్వల్పంగా పెరిగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

ఊరంతా ఉగాది 'శోభ'



అనంతపురం పాతూరులో పండుగ సరుకుల కొనుగోళ్ల దృశ్యం

అనంతపురం కల్చరల్ : 'ఉగ' అంటే నక్షత్రాల గమనం లేదా సృష్టి అని అర్థం. 'ఆది' అనగా ప్రారంభం అని అర్థం. సృష్టి ఆరంభం లేదా యుగారంభమే యుగాది. అదే కాలక్రమంలో ఉగాదిగా రూపాంతరం చెందింది. ఏటా చైత్రశుక్ల పాడ్యమి రోజున వచ్చే ఈ పండుగను తెలుగు సంవత్సరాదిగా ప్రతి ఇంటిలో తోరణాలు కట్టి, వేపపూత పచ్చడితో ఆనందోత్సాహాల నడుమ సాదరంగా ఆహ్వానిస్తారు. జీవిత గమనంలో కష్టసుఖాలను ప్రతిబింబించే షడ్రుచుల సమ్మేళనంతో ఈ పండుగ సరదాగా సాగిపోతుంది. విజయతీరాలు చేరుకోవాలని పచ్చని తోరణాలు, మంగళవాయిద్యాలతో శుభకృత్ నామ సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ శోభకృత్ నామ సంవత్సరానికి ఆహ్వానం పలికే కార్యక్రమాలు శోభాయమానంగా జరగనున్నాయి.

నేడు ఉగాది సంబరాలు : శోభకృత్ ఉగాది నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం నగరంలో పలు చోట్ల ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంబరాలు జరగనున్నాయి. మార్కెట్ పరిసరాలు మామిడాకులు, బంతిపూలు, మామిడి కాయల అమ్మకాలతో సందడిగా మారాయి.

రాగిజావతో మరింత ఆరోగ్యం

రాప్తాడురూరల్: రాగిజావ పంపిణీతో విద్యార్థులు మరింత ఆరోగ్యంగా ఉంటారని డీఈఓ సాయి రామ్ అన్నారు. మంగళవారం అనంతపురంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'రాగిజావ' పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఇప్పటికే 15 రకాల పోషక విలువలు కల్గిన 'జగనన్న గోరుముద్ద'ను మధ్యాహ్న భోజనం కింద అందజేస్తోందన్నారు. తాజాగా ఇందులో రాగిజావను కూడా చేర్చిందన్నారు. దీనిద్వారా రక్తహీనత, పోషకాహార లోపం సమస్యలకు చెక్ పెట్టినట్లవుతుందన్నారు. వారంలో మూడు రోజుల (మంగళ, గురు, శనివారం)పాటు బెల్లంతో కూడిన రాగిజావను అందించేలా



రాగిజావ తాగుతున్న విద్యార్థులు

ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పలువురు విద్యార్థులు రాగిజావ చాలా రుచికరంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఏడీలు పద్మప్రియ, కృష్ణయ్య, ఎంఈఓ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతపురంతో పాటు రూరల్ మండలంలో అన్ని స్కూళ్లలోనూ రాగిజావ పంపిణీని పండుగలా నిర్వహించారు.

2,07,550 మంది విద్యార్థులకు రాగిజావ

అనంతపురం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మరో బలవర్ధకమైన రాగిజావ అందించే కార్యక్రమం ప్రారంభమైందని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. జిల్లాలోని 1,698 ప్రభుత్వ పాఠశాలల్లోని 2,07,550 మంది విద్యార్థులకు ఇక నుంచి వారంలో మూడు రోజులు రాగిజావ ఇస్తారన్నారు. రాగిజావను ఉదయం పూట అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి జేసీ కేతన్‌గార్గ్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, డీఈఓ సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

అనంతపురం అర్బన్/శ్రీకంఠం సర్కిల్/ కళ్యాణదుర్గం: జిల్లా ప్రజలకు మంత్రి ఉషశ్రీచరణ్, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ ఫక్కీరప్ప వేర్వేరు ప్రకటనల్లో తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆనందంగా జీవించాలని, ప్రతి ఇంటా సుఖ సంతోషాలు, సిరి సంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.



బతికుండగానే చంపేశారు!

- బీమా మొత్తం కోసం ఐదుగురు వ్యక్తుల నిర్వాకం
- కంపెనీ అధికారుల విచారణలో విషయం బట్టబయలు
- ఐదుగురు ముఠా సభ్యుల అరెస్టు

తాడిపత్రి అర్బన్: జీవిత బీమా చేసిన వ్యక్తి బతికుండగానే మరణించినట్లు తప్పుడు సర్టిఫికెట్లు సృష్టించి పరిహారం మొత్తాన్ని కాజేసేందుకు ప్రయత్నించిన ఐదుగురు సభ్యుల ముఠాను తాడిపత్రి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు డీఎస్పీ వీఎన్‌కే చైతన్య పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ ఆనందరావు, ఎస్‌ఐ ధరణీబాబుతో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు. తాడిపత్రి పట్టణంలోని హరిజనవాడకు చెందిన గిత్త రంగనాయకులు భారతి యాక్స్ జీవిత బీమా కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా పని చేస్తుండేవాడు. అదే కంపెనీలో పట్టణానికి చెందిన బండి శాంతమ్మ రూ.20 లక్షలకు జీవిత బీమా చేసింది. విషయం తెలుసుకున్న గిత్త రంగనాయకులు, తాడిపత్రి మండలం హుసేనాపురం గ్రామానికి చెందిన నారాపురం గురుశేఖర్, చింతలయ్య గారి రంగనాయకులు, చంద్రశేఖర్, గుడిపాటి గౌస్‌పీర్ సహకారంతో నకిలీ డెత్, ఫ్యామిలీ, డాక్టర్ సర్టిఫికెట్లు సృష్టించారు. పాన్, ఆధార్ కార్డులలో ఫొటో మార్ఫింగ్ చేసి బ్యాంక్ అకౌంట్లు ప్రారంభించారు. బండి శాంతమ్మకు చెందిన రూ.20 లక్షల బీమా మొత్తాన్ని కాజేసేందుకు పథకం పన్నారు. విచారణకు వచ్చిన సదరు బీమా సంస్థ అధికారులకు బండి శాంతమ్మ బతికే ఉందన్న విషయం తెలిసి కంగుతిన్నారు. విషయం తెలుసుకుని బాధితురాలు సోమవారం రాత్రి పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు రంగప్రవేశం చేసి నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి బీమా మొత్తాన్ని కాజేసేందుకు ప్రయత్నించిన ఐదుగురినీ అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు కంప్యూటర్లు, నకిలీ సీళ్లతో పాటు నకిలీ సర్టిఫికెట్లు, ఆర్‌కే ఆసుపత్రికి చెందిన వైద్యుడు రామకేశవరెడ్డి పేరుతో ఉన్న లెటర్‌హెడ్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఐదుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.









పోషణ్ పక్వాడా విజయవంతం చేయండి : జేసీ

అనంతపురం అర్బన్: జిల్లాలో పోషణ్ పక్వాడా – పౌష్టికాహార పక్షోత్సవాలను విజయంతం చేయాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంపై మంగళవారం తన చాంబర్ నుంచి అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ నెల 20న ప్రారంభమైన పౌష్టికాహార పక్షోత్సవాలు ఏప్రిల్ 3వ తేదీతో ముగుస్తాయన్నారు. ముందస్తుగా ప్రకటించిన షెడ్యూల్ మేరకు ఈ 15 రోజుల పాటు కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆదేశించారు. ఇందులో సచివాలయాల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ, ఐసీఈఎస్ వ్యవసాయ, పాఠశాల విద్య, ఉద్యాన, వైద్యారోగ్య, మునిసిపల్, సంక్షేమ శాఖలను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని ఐసీడీఎస్, డీఆర్‌డీఏ అధికారులకు సూచించారు. కార్యక్రమాలను రోజువారీగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.







ఉగాది ఉత్సవాలకు సిద్ధం

- కసాపురంలో నేటి నుంచి ఉత్సవాలు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఉగాది మహోత్సవాలకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. వేసవి దృష్ట్యా ఆలయ ప్రాంగణం, పరిసరాల్లో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఆలయ ఎదుట ఉన్న రెండు పార్కులను సుందరీకరించారు. ఉత్సవాలకు నిరంతర విద్యుత్ సరఫరాల ఉండేలా చొరవ తీసుకున్నారు. అలాగే గుంతకల్లు మున్సిపాలిటీ నుంచి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో రెండు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. మూడు రోజుల పాటు సాగే ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు ఈ నెల 22న గ్రామోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకున్నారు. బెంగళూరు నుంచి ప్రత్యేకంగా పూలను తెప్పించారు. సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి శమీ వృక్షం వరకూ గ్రామోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం సాయంత్రం 6 గంటలకు పంచాంగ శ్రవణం ఉంటుంది. ఈ నెల 23న స్వామి రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. చివరగా మూడో రోజు లంకాదహనం కార్యక్రమంతో ఉత్సవాలను ముగించనున్నారు.


విద్యుద్దీపాలంకరణలో వెలుగులీనుతున్న ఆలయం

'స్కిల్' కుంభకోణం సూత్రధారి బాబునే

- నైపుణ్యాభివృద్ధి శిక్షణ పేరుతో రూ.371 కోట్లు దోచేశారు
- అసెంబ్లీలో ఎమ్మెల్యే కేశవ్ తీరు జుగుప్సాకరం
- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ధ్వజం



ఉరవకొండ: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో అసలు సూత్రధారి మాజీ సీఎం చంద్రబాబునేనని, అప్పట్లో టీడీపీ నేతలను ముఠాగా ఏర్పాటు చేసి రూ.371 కోట్లను షెల్ కంపెనీ ద్వారా కొల్లగొట్టారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఉరవకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో చంద్రబాబు అండ్ కో సాగించిన అక్రమాలకు సరైన సాక్ష్యాధారాలను ప్రభుత్వం బహిర్గతం చేసిందన్నారు. దీంతో అసెంబ్లీ సమావేశాలు సజావుగా సాగనివ్వకుండా అడ్డుకునేందుకు టీడీపీ ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇందులోనూ ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తీరు మరీ జుగుప్సాకరంగా ఉందన్నారు. వీధి రౌడీలను తలదన్నేలా ఏకంగా సభాపతి పైనే పేపర్లు విసురుతూ ఆగౌరపరిచారన్నారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా పథకం ప్రకారం సభ నుంచి టీడీపీ ఎమ్మెల్యేలు వైదొలుగుతున్నారన్నారు. ఇదంతా చంద్రబాబు కుట్రలో భాగమేనని అభివర్ణించారు.

జూలైలో ఎస్కేయూ స్నాతకోత్సవం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవాన్ని ఈ ఏడాది జూలైలో నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన పాలక మండలి సమావేశం ఆమోదముద్ర వేసింది. సుదీర్ఘంగా సాగిన పాలక మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశానికి ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన సాగిన ఈ సమావేశానికి వర్చువల్ విధానంలో ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ జె.శ్యామలారావు, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, పాలక మండలి సభ్యులు కె.గోవిందరెడ్డి, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. రెక్టార్ ఎ.మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, పాలకమండలి సభ్యులు మహీధర్, డాక్టర్ శంకరయ్య, ప్రపూర్ణ రెడ్డి, డాక్టర్ జమీలా బీబీ పాల్గొన్నారు.

సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలు..

- ఇటీవల మృతిచెందిన ఇద్దరు వర్సిటీ ఉద్యోగులకు సంబంధించి వారి కుటుంబసభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాల కల్పన.
- జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకాంత్, కరాటే చిన్న పెద్దన్నపై సస్పెన్షన్ ఎత్తివేత.
- సెరికల్చర్ విభాగం టీచింగ్ అసిస్టెంట్ డాక్టర్ సుజాతకు చెల్లించాల్సిన రెండేళ్ల అరియర్స్ మొత్తానికి సంబంధించిన అంశంపై వచ్చే పాలకమండలి సమావేశంలో తుది నిర్ణయం.
- న్యాక్ పీర్ కమిటీ పర్యటన నేపథ్యంలో రూ.కోటితో వర్సిటీని సుందరవనంగా తీర్చిదిద్దేందుకు ఆమోదం.
- క్యాంపస్ పాఠశాలలోని ముగ్గురు ఉపాధ్యాయుల బకాయి జీతాల చెల్లింపునకు గ్రీన్ సిగ్నల్.
- ఇంజినీరింగ్ కళాశాల నుంచి కంప్యూటర్ సైన్సెస్‌కు ఆచార్య భాస్కరరెడ్డి బదిలీ కొనసాగింపు.
- ఎంబీఏ విభాగానికి కంప్యూటర్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దేవరాజు బదిలీ.
- క్యాంపస్‌లో నూతన రోడ్ల నిర్మాణానికి ఆమోదం.
- 8 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం కింద పదోన్నతులు.
- ఒకే అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉన్న విభాగాలకు విభాగాధిపతుల నియామకం. డిపార్ట్‌మెంట్ కో–ఆర్డినేటర్లుగా ఇంగ్లిష్ విభాగానికి డాక్టర్ వి.మాధవి, సెరికల్చర్‌కు డాక్టర్ సత్యనారాయణ, లా విభాగానికి డాక్టర్ ఎం. శ్రీరాములు, పొలిటికల్ సైన్సెస్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌కు డాక్టర్ చంద్రమౌళిరెడ్డి నియామకం.
- ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాల విలీనం. ఇకపై ఫిజిక్స్ విభాగంగానే పరిగణింపు.
- ఇండస్ట్రియల్, ఎగ్జిక్యూటివ్ కోటాలో పీహెచ్‌డీ అడ్మిషన్లు.
- 25 విభాగాల్లోని తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ డిస్‌ప్లే ప్యానల్స్ ఏర్పాటుకు రూ.66 లక్షలు కేటాయింపు.
- ఉద్యోగ విరమణ పొందిన ప్రొఫెసర్లంతా కలిసి రిటైర్డ్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకునేందుకు ఎంబీఏ విశ్రాంత ప్రొఫెసర్ ప్రేమ్ కుమార్ ఇచ్చిన వినతికి గ్రీన్ సిగ్నల్.
- క్యాంపస్‌లో వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు.
- రాష్ట్రీయ ఉచ్ఛతార్ శిక్షా అభియాన్ కో–ఆర్డినేటర్‌గా ఫిజిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ రాంగోపాల్ నియామకం.
- పరీక్షల రహస్య విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్, ఆర్.దివాకర్ శాస్త్రి, కె.ఫయాజ్‌కు నెలకు రూ.28 వేల నుంచి రూ.40 వేలకు జీతం పెంపు.
- లా కోర్సులకు సంబంధించి గతంలో బార్ కౌన్సిల్ అనుమతికి దరఖాస్తు జాప్యమైంది. ఈ నేపథ్యంలో రూ.5 లక్షల జరిమానా విధించారు. ఇందుకు బాధ్యులైన వారి నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని పాలకమండలి నిర్ణయించింది.

రూ. 232 కోట్లకు చేరిన పంటనష్టం

అనంతపురం అగ్రికల్చర్: వడగండ్లవాన, పెనుగాలులకు దెబ్బతిన్న పంటల నష్టం రూ.232 కోట్లకు చేరింది. 4,480 హెక్టార్లలోఉద్యాన పంటలు దెబ్బతినడంతో రూ.212 కోట్లు నష్టం జరిగినట్లు ఆశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఇక 3,200 హెక్టార్లలో మొక్కజొన్న, వరి, వేరుశనగ, కొర్ర, ఆముదం తదితర వ్యవసాయ పంటలకు నష్టం రూ. 20 కోట్లకు చేరుకుంది.

'అగ్నివీర్' ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: అగ్నివీర్ కార్యాచరణలో భాగంగా భారత వాయుసేనలో ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్/డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 31వ తేదీ లోపు https://agnipathvayu.cdac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు అందజేయాలి. పూర్తి సమాచారానికి 99595 17370లో సంప్రదించవచ్చు.

సెలవులో కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం అర్బన్: వ్యక్తిగత పనులపై కలెక్టర్ నాగలక్ష్మి మంగళవారం నుంచి మూడు రోజులు సెలవు పెట్టారు. తిరిగి ఆమె ఈనెల 24న విధులకు హాజరవుతారు. అప్పటి వరకు జేసీ కేతన్‌గార్గ్ ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తిస్తారు.

సాంకేతికతను అందిపుచ్చుకుని ముందున్నాం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: సాంకేతికతను అందిపుచ్చుకోవడం వల్లనే నేరాల నియంత్రణలో ముందు వరుసలో ఉన్నట్లు ప్రొబేషనరీ ఐపీఎస్‌లకు ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప వివరించారు. టెక్నాలజీ వినియోగంపై ప్రొబేషనరీ ఇద్దరు ఐపీఎస్, 26 మంది డీఎస్పీలకు పోలీసు శిక్షణ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. 'చాట్ బాట్, హై అలెర్ట్, అనంత ఈగల్ ఐ' యాప్‌ల వినియోగం, లాడ్జి మానిటరింగ్ సిస్టం పనితీరుపై అవగాహన కల్పించారు.

ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం

రాప్తాడురూరల్: ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనం (స్పాట్) మంగళవారం ప్రారంభమైంది. అనంతపురం కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా మూల్యాంకనం చేపట్టారు. తొలిరోజు సంస్కృతం జవాబుపత్రాలను దిద్దారు. ఇంటర్ పరీక్షలు ముగిసేదాకా మధ్యాహ్నం నుంచి 'స్పాట్' కొనసాగుతుందని ఆర్‌ఐఓ సురేష్‌బాబు తెలిపారు. కాగా, మంగళవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం గణితం–2ఏ, బోటనీ, సివిక్స్ పరీక్షలు సజావుగా జరిగాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 31,102 మంది విద్యార్థులకు గాను 30,349 మంది హాజరయ్యారు.

ఆధార్ అనుసంధానం చేయించుకోండి

అనంతపురం రూరల్: జగనన్న విద్యా దీవెన పథకానికి అర్హులైన విద్యార్థులు వెంటనే తమ బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1,641 మంది ఎస్సీ విద్యార్థులు, ఇతర కులాలకు చెందిన 238 మంది విద్యార్థులు బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం చేయించుకోవాల్సి ఉందన్నారు.

'డెమో' మొరాయింపు

అనంతపురం సిటీ: గుంతకల్లు నుంచి హిందూపురానికి మంగళవారం సాయంత్రం బయలుదేరిన డెమో (ప్యాసింజర్ రైలు) 5.40 గంటలకు అనంతపురం సమీపంలోని నేషనల్ పార్క్ వద్దకు చేరుకోగానే సాంకేతిక సమస్య తలెత్తడంతో ఆగిపోయింది. విషయం తెలుసుకున్న అనంతపురం రైల్వే స్టేషన్ మేనేజర్ ప్రసాద్, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది అక్కడకు చేరుకుని బ్రేక్‌డౌన్‌కు కారణాలు ఆరా తీశారు. గుంతకల్లు నుంచి మరో ఇంజిన్‌ను తెప్పించి రాత్రి 8.45 గంటలకు రైలును సాగనంపారు.


భద్రతను పర్యవేక్షిస్తున్న ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది

'పది' రెండో సెట్ ప్రశ్నపత్రాల తరలింపు

రాప్తాడు రూరల్: ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించిన రెండో సెట్ ప్రశ్నపత్రాలను అనంతపురంలోని స్ట్రాంగ్‌రూం నుంచి మంగళవారం స్టోరేజ్ పాయింట్లకు తరలించారు. రెండు రోజుల క్రితం సెట్–1 ప్రశ్నపత్రాలను తరలించిన విషయం తెలిసిందే. మొత్తం 35 స్టోరేజ్ పాయింట్లకు పోలీసు బందోబస్తు మధ్య ప్రశ్నపత్రాలను తరలించారు. ఈ ప్రక్రియను జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరాం, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్, రెవెన్యూ అధికారులు పర్యవేక్షించారు.

Roc.No. 291/2022/A1 పురపాలక సంఘ కార్యాలయము, గుత్తి.
తేది : 21-03-2023

వేలము ప్రకటన

గుత్తి పురపాలక సంఘమునకు చెందిన ఈ క్రింద మార్కెట్ మరియు జంతు వధశాలల్లో 01-04-2023 నుండి 31-03-2024వ తేది వరకు రుసుములు వసూలు చేసుకొను హక్కును లీజుకిచ్చుటకు తేది 16-02-2023 న నిర్వహించవలసిన 2023-24 సంవత్సరమునకు మార్కెట్ మరియు జంతు వధశాలలు బహిరంగవేలము ఎన్నికల నియమావళి అమల్లో వున్నందున వాయిదా వేయడమైనది తిరిగి తేది 25-03-2023 శనివారము ఉదయం 11-00 గం॥లకు బహిరంగ వేలము వేయబడును. ఆసక్తి గల వారు వేలము నోటిఫికేషన్ షరతులకు లోబడి పాల్గొనవచ్చును. ఏ కారణము చూపకనే వేలములు రద్దు చేయుటకు లేదా వాయిదా వేయుటకు కానీ కమిషనరు గారు లేదా వారి నుండి అధికారము పొందిన వారికి అధికారము కలదు. వేలము పాట రోజు తహశీల్దారు లేదా మున్సిపల్ కమిషనరు గారిచే పొందిన సాల్వెన్సీ సర్టిఫికేట్ మరియు డి.డి. సమర్పించవలెను మరియు పాటదారునికి ఏదేని బ్యాంకు నందు తప్పక ఖాతా వుండవలెను మరియు వేలము ఖాయపరచిన వారి ఖాతా చెక్కులు కూడా సమర్పించుటకు సిద్ధంగా ఉండవలెను. మిగతా వివరాలకు కార్యాలయము పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును మరియు రూ. 50/-లు గుత్తి పురపాలక సంఘము ఖజానా నందు చెల్లించి వేలము నోటిఫికేషన్ ప్రతిని పొందగలరు.

వ.నెం.	వివరములు	ధరావత్తు	సాల్వెన్సీ మొత్తము	అదనపు ధరావత్తు
1	దినసరి మార్కెట్ మరియు బస్టాండుతో కలిపి	రూ. 1,00,000/-	రూ. 10,00,000/-	రూ. 3,00,000/-
2	జంతు వధశాల	రూ. 5,000/-	రూ. 50,000/-	రూ. 15,000/-

సం/- కమిషనరు (FAC), గుత్తి పురపాలక సంఘము



సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

EAPCET COACHING

■ Short Term Coaching for NEET EAPCET (MED & ENG) Free Demo Class on March 30 & 31 Classes Start from April 1st, బాల బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి కలదు. Contact: సాయి ఇన్‌స్టిట్యూట్, కమలానగర్, ATP. 8919265279, 9059723829. [A-496]

DISTANCE EDUCATION

■ AU, ANU & SVU అడ్మిషన్స్ జరుగుచున్నవి BA, B.Com, B.Sc. (TM/EM) (All Groups), M.A., M.Com, M.Sc., (All Subjects) M.B.A, M.S.W, B.L.I.Sc, M.L.I.Sc & (Regular B.Ed Seats) డా.బి.మధుసూధన: 8328279245. [V-5658]

REAL ESTATE

FOR RENT / LEASE

■ ATP, రామచంద్రనగర్ మెయిన్ రోడ్, సైఫుల్లా బ్రిడ్జ్ దగ్గర, 24x75 = 1,800 చ.అ. కమర్షియల్ బిల్డింగ్ వ్యాపారానికి / ఫైనాన్స్, కార్పొరేట్ ఆఫీస్‌లకు బాడుగకు కలదు. సెల్: 9490869229. [A-734027]

FOR RENT

■ 2BHK Flat with furniture at Kalyandurgam Main Road, Anantapur. Contact: 9014848030. [A-567]

PLOT FOR SALE

■ GMR COLONY, Alamuru Road, Anantapur. AHUDA approved open plots for sale. Cont: 9392183377, 9281024684, 9391756322. [A-597]

■ HIGHWAY COUNTY, Beside APS Warehousing Godowns, near SVIT, NH 44, AHUDA approved plots for sale. 9392183377, 9281024684, 9391756322. [A-598]

■ GREEN COUNTY, Rapthadu, NH 44, AHUDA approved open plots for sale. Cont: 9392183377, 9281024684, 9391756322. [A-599]

■ ATP, సవీరా హాస్పిటల్ & ఐశ్వర్య విల్లాస్ సమీపంలో 100 ఫీట్ రోడ్‌కి, అహుడా అప్రూవల్ గల 8.4 సెంట్ల నార్త్ + సౌత్ ఫేస్ ప్లాటు అమ్మబడును. నో బ్రోకర్స్. 9494981688. [A-734320]

EMI పద్ధతిలో ప్లాట్లు

■ S.K. యూనివర్సిటీకి దగ్గర, తక్కువ ధరల్లో, డెవలప్‌మెంట్స్‌తో EMI పద్ధతిలో ప్లాట్లు కలవు. సం॥ కాలంలో రెట్టింపు అయ్యే సదవకాశం. వెంటనే సంప్ర॥ సెల్: 9642999578. [A-734338]

HOUSE FOR SALES

■ ATP లోని రాంనగర్ 80 ఫీట్ రోడ్డు అయ్యప్ప స్వామి టెంపుల్ దగ్గర, అన్ని వసతులు కలిగిన Duplex, Individual డబుల్, త్రిపుల్ బెడ్ రూం ఇళ్లు లోన్ సదుపాయంతో అమ్మకంనకు కలవు. సెల్: 9866011539, 7396726935. [A-2422]

SERVICES

AGRICULTURE SERVICES

■ రైతు సోదరులకు అందిస్తున్నాం ఇప్పుడు అన్నిరకాల జంతువుల నుండి మీ పంటను కాపాడుకోండి. సోలార్ ఫెన్సింగ్ బిగుంచుకొని మరియు టార్పాలిన్ పట్టలు లభించును. సంప్ర : దేవి ఎంటర్ ప్రైజెస్ – 79891 93731 [L-795016]

BUSINESS OFFER

■ Capro కంపెనీ ప్రైవైడ్ అన్ని రకములైన బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను, మంచి జీతం + కమీషన్, ✆ 9319814720. [T-1196145]

■ A growing Indian news channel : News9tv channel is on expansion mode is looking for channel partners / financers with an assured attractive returns on investment. Contact, Hyderabad ph: 8096852222 [HA-10671]

WANTED

■ అనంతపురము నగరం & గుంతకల్లు నందు హోమ్ ట్యూషన్స్ బోధించుటకు బి.ఎడ్., డి.ఎడ్. చేసిన టీచర్లు వెంటనే కావలెను. సెల్ : 8309486255, 9885262354. [A-2411]

■ హైదరాబాద్ వృద్ధాశ్రమంలో పని॥కు రెసి॥ టీచర్ టీచర్స్, రెసి॥ వంటవారు (వ: 35సం॥ ఆపైన) & ఆయాలు కావలెను. మంచి జీతం ఫ్రీ వసతి, భోజన సదుపాయం. సంప్ర: Ph: 9700006699, 7981467036. [H-793538]

■ యూకేకి చెందిన ఇన్సూరెన్సు కంపెనీ యందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 3.6 Lpa, రెజ్యూమ్ పంపవలసిన ఐడి: workforce@e-ssure.com [HA-10682]

■ WANTED Maths, Physics & Chemistry Faculty to Teach IIT-JEE & EAMCET @ Engineers Gate Academy, Near JNTU, ATP. 9704838326. [A-734339]

■ ప్రముఖ కంపెనీ వారి Work from Home జాబ్ చేయుటకు, ఇంటర్, డిగ్రీ చదివిన (M/FM) అర్జెంటుగా కావలెను. సెల్: 9492507795, ATP. [A-497]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795248]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 16K-18K. విజయవాడ. Ph: 9640528899, 9640648899 [HA-1117]

■ అతి తక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి కొత్తరికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. 7730899508 [G-520]

■ MEGA GROUP MAN POWER & Security సంస్థ విస్తరణలో భాగంగా AP & TS లలో జిల్లాల వారీగా ఈ ఫీల్డ్‌లో అనుభవమున్న వారికి ఫ్రాంచైజ్ ఇవ్వబడును. (పెట్టుబడి లేదు). సెల్ : 70826 10569, 70931 25169. [NA-5449]

■ జాబ్స్ : BPL ఎడ్యుకేషనల్ ఫౌండేషన్‌కి గ్రామాల, మండలాల వారీగా, మంత్లీ శాలరీతో, అడ్మిషన్స్ చేయడానికి ఏజెంట్స్ కావలెను. సంప్ర॥ G.మురళి, 9030661651, అనంతపురం. [A-734321]

■ IIT, NEET Teach చేయుటకు అనుభవం కలిగిన, DTP & Computer ఆపరేటర్లు, PET, హ్యాండ్ రైటింగ్ టీచర్స్ కావలెను. సెల్: 9491986783 [A-495]

■ ఉద్యోగాలు: S.R. నూతనంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లలో జాబ్ చేయుటకు యువతీ, యువకులకు అవకాశం. Q: 10th, ఇంటర్, డిగ్రీ (P/F), Age: 18 to 28 నో ఫీజ్, Cell: 9177342337. [WA-6915]

■ విజయవాడలో ప్రముఖ హోంకేర్ ఆఫీస్‌కి వృద్ధులను, బెడ్‌పేషంట్ లను వారి ఇంటి వద్దె చూసుకొనుటకు కేర్‌టేకర్స్ M/F కావలెను. జీతం 15-20K వసతి+భోజనంరి 9494225282, 7207072559 [B-970]

■ Tele Callers, కంప్యూటర్ ఆపరేటర్, రిసెప్షనిస్ట్, క్యాషియర్, Supervisorగా M/F కావలెను, జీతం: 8–20 వేలు, అన్ని రకాల ప్రైవేట్ ఉద్యోగాలకు సంప్ర:9000775715. [T-4101]

■ జీతం: 10K-25K+ రూం Free, Hyd. Qul: 5th- any Degree. Urgent గా కావలెను. స్త్రీలు/ పురుషులు, Nurses, Caretaker కావలెను. ఫోన్ : 9000250893 [HA-92671]

■ అనంతపురము టౌన్, టవర్‌క్లాక్ సర్కిల్‌లో గల, షాపింగ్ మాల్ నందు పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ అర్జెంటుగా కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సెల్: 9848524061. [A-734337]

■ ATP, జీసెస్ నగర్ నందున్న ప్రముఖ S.V. Jr. College నందు టీచింగ్ మరియు నాన్ టీచింగ్ పోస్టులు. సంప్రదించండి. సెల్: 9440861306, 8374029801. [A-7654]

■ Required Principal, Full Time Maths, Physics, Chemistry, Commerce, Economics, English, Botany, Zoology, Sanskrit Lecturers, PRO's & Wardens. # Sri Masters Junior Colleges, Anantapur. Ph: 9440774498. [A-734333]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

అద్దెకు
అమ్మకం
రియల్ ఎస్టేట్
ఫర్నీచర్స్
ఆటోమొబైల్
కంప్యూటర్స్
సర్వీసెస్
కావలెను

4 లైన్లు రూ॥ 270/-
అదనపు లైను రూ॥ 60/-
(GST 5% అదనం)
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం

ANANTHAPURAMU : 9010567770, 9492288307, 9010588846, 9243295650
DHARMAVARAM : 9912220726, 9912220727
HINDUPUR : 9912220723, 9705346587
GUNTAKAL : 9010223701
TADIPATRI : 9912220722
MADAKASIRA : 9010200238
KADIRI : 9010593486
RAYADURG : 9010470185

క్లుప్తంగా

ప్రజలకు ఎమ్మెల్యే ఉగాది శుభాకాంక్షలు

- ఎమ్మెల్యేలు అనంత, తోపుదుర్తి





అనంతపురం క్రైం: అనంతపురం నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు ఉగాది కొత్త సంవత్సరంలో వర్షాలు విరివిగా కురిసి, పంటలు బాగా పండి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా నగర, రూరల్ పంచాయతీల అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా ముందుకుతీసుకెళ్తున్నారన్నారు. త్వరలో జాతీయ రహదారి విస్తరణ ఫోర్ వే, బ్రిడ్జ్ పనులు పూర్తవుతాయన్నారు. నగరంలో అంతర్గత రోడ్లు, కాలువలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మరో రెండు నుంచి నాలుగు నెలల్లో నగరం రూపురేఖలు మారిపోతాయన్నారు. ప్రధాన నగరాలను తలపించేలా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. నగర మేయర్ వసీం మంగళవారం ఓ ప్రకటనలో నగర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

రాప్తాడురూరల్: రాప్తాడు నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికీ సిరిసంపదలు, సుఖ సంతోషాలు ఇవ్వాలని కోరుకుంటూ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలుగువారికి ఉగాది పండుగతోనే సంవత్సరం ప్రారంభమవుతుందన్నారు. ఈ కొత్త సంవత్సరంలో నియోజకవర్గంలో ప్రతి కుటుంబం సంక్షేమం, సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలని, పల్లెల్లో పశు సంపద, వ్యవసాయ, ఉద్యాన పంటలతో రైతులు కళకళలాడాని ఆకాంక్షించారు.

ఎస్పీని కలసిన అసిస్టెంట్ కలెక్టర్ సూరపాటి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ కె.ఫక్కీరప్పను అసిస్టెంట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్‌కుమార్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రెండు వారాల పాటు పోలీసు స్టేషన్ల నిర్వహణ, పనితీరు, శాంతిభద్రతల పరిరక్షణ, తదితర అంశాలపై శిక్షణ పొందనున్నారు. అందులో భాగంగా ఆయన ఎస్పీని కలసి పలు విషయాలపై చర్చించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



దొక్కా గోపాల్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాప్తాడు: మండలంలోని గాండ్లపర్తికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు డొక్కా గోపాల్ మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి గాండ్లపర్తికి చేరుకొని డొక్కా గోపాల్ మృతదేహానికి నివాళులర్పించారు. తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, నాయకులు శివయ్య, విజయశంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

యువకుడిపై ఆత్మహత్యా యత్నం కేసు నమోదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: తనను అనవసరంగా పోలీస్ స్టేషన్‌కు పిలిపించుకుని ఇబ్బంది పెడుతున్నారంటూ ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. అనంతపురంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన చరణ్‌సాయి.. తనను వేధిస్తున్నాడంటూ ఓ యువతి దిశ పోలీసులను ఆశ్రయించింది. దీనిపై స్పందించిన దిశ పోలీసులు చరణ్‌సాయికి మంగళవారం ఫోన్ చేసి ఓసారి పోలీస్ స్టేషన్‌కు వచ్చి వివరణ ఇచ్చి వెళ్లాలని సూచించారు. దీంతో భయపడిన యువకుడు... తాను విషపూరిత ద్రావకం తాగి ఆత్మహత్య చేసుకోబోతున్నానని, ఇందుకు యువతి కుటుంబసభ్యులే కారణమంటూ వాయిస్ రికార్డును తన కుటుంబసభ్యులతో పాటు, పోలీసులకూ పంపి, అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఈ చర్యతో భయపడిన కుటుంబసభ్యులు వెంటనే దిశ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అదే సమయంలో కంగారు పడిన పోలీసులు చరణ్‌సాయి ఆచూకీని గుర్తించేందుకు పరుగులు తీశారు. దాదాపు గంటకుపైగా ఉత్కంఠకు తెరలేపిన యువకుడు తర్వాత నెమ్మదిగా దిశ పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. కాగా, గతంలోనూ ఇదే యువతి అనంతపురం మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినప్పుడు కూడా తాను విషపూరిత ద్రావకం తాగినట్లు చరణ్‌సాయి నాటకమాడాడు. తిరిగి ఇలాగే ప్రవర్తించడంతో ఈ అంశాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణించి, యువకుడిపై ఆత్మహత్యాయత్నం నేరం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



నగరంలోని ఛత్రపతి స్కూల్‌లో పిల్లలకు రాగి జావా అందిస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి



విద్యార్థులకు రాగి జావను పోస్తున్న ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి



ఆత్మకూరులో రాగిజావ అందిస్తున్న ఎంఈఓ నరసింహ

అనంతపురం క్రైం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చారని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఛత్రపతి స్కూల్‌లోని విద్యార్థులకు రాగిజావాను ఆయన అందజేశారు. జగనన్న గోరుముద్దలో రాగిజావాను చేర్చడం ద్వారా పిల్లలకు మంచి పౌష్టికాహారం లభిస్తుందన్నారు. ఇప్పటికే పిల్లలకు అమ్మఒడి, ట్యాబ్‌లు, నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపురేఖలను మార్చేశారన్నారు. డివిజన్‌లోని సునితానగర్‌లోని శారద నగరపాలక ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ గురుశేఖర్ బాబు పాల్గొన్నారు. అనంతరం ఆయన పిల్లలకు రాగిజావాను అందించారు.

విద్యార్థుల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

రాప్తాడు: విద్యార్థుల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకాన్ని (మధ్యాహ్న భోజనం) పటిష్టంగా అమలు చేస్తోందని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి తెలిపారు. మంగళవారం మండలంలోని గంగలకుంటలో ప్రాథమిక పాఠశాలలో రాగి జావ కార్యక్రమాన్ని ఎంపీపీ చేతుల మీదుగా ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో రాగి జావను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, ఎంఈఓ మల్లికార్జున, ఎంపీడీఓ సాల్మన్, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించటమే లక్ష్యం

కనగానపల్లి: పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందచడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ తెలిపారు. మంగళవారం తూంచర్ల ప్రాథమిక పాఠశాలలో ఆమె జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రాగిజావా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థుల కోసం జగనన్న గోరుముద్ద పథకాన్ని చేపట్టారన్నారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం ద్వారా రాగిజావా పంపిణీని కూడా ప్రారంభించి, పిల్లలకు మరింత పౌష్టికాహారం అందేలా చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంఈఓ అరుణమ్మ, సర్పంచ్ రేణుకమ్మ, పాఠశాల చైర్మన్ బాబయ్య, హెచ్‌ఎం రంగారెడ్డి, నాయకులు నాగముని, తదితరులు పాల్గొన్నారు.

రాగిజావ పంపిణీ

ఆత్మకూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరు ముద్దలో భాగంగా రాగి జావ కార్యక్రమాన్ని మంగళవారం అమలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ నరసింహారెడ్డి, సర్పంచ్‌లు వరలక్ష్మి, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణరెడ్డి, నరసింహా, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



కనగానపల్లిలో విద్యార్థులకు రాగిజావా అందిస్తున్న ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, అధికారులు

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

అనంతపురం సిటీ: బోగస్ ఆధార్ కార్డులు ఎక్కువయ్యాయని, వాటికి చెక్ పెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం ఆధార్ అప్‌డేట్‌కు చర్యలు చేపట్టిందని అనంతపురం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ) ఓబుళమ్మ తెలిపారు. అనంతపురంలోని నిర్మలానంద నగర్, వేణుగోపాల్ నగర్-4, 5, శ్రీనివాస నగర్ సచివాలయాలను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆధార్ నవీకరణ (అప్‌డేట్) ప్రక్రియ ఇప్పుడు కీలకమైందన్నారు. ఆధార్ తీయించుకొని పదేళ్లు పూర్తయిన వారందరూ అప్‌డేట్ చేయించుకోవాలని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరించి, వారిలో చైతన్యం తీసుకురావాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గడువులోపు ఆధార్ అప్‌డేట్ చేయించుకోకపోతే, అలాంటి వారి ఆధార్‌ను కేంద్ర ప్రభుత్వం తొలగిస్తుందనే విషయాన్ని ప్రచారం చేయాలని సూచించారు. ఆధార్ అప్‌డేట్ కోసమే జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకంగా 79 సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ అప్‌డేట్ నమోదుకు అనుమతించినట్లు తెలిపారు. ప్రత్యేకించి ఈ నెల 27, 28, 29 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు కూడా నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు. జిల్లా వ్యాప్తంగా 11, 32,391 మంది అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉందని ఆమె స్పష్టం చేశారు. అప్‌డేట్ ప్రక్రియ పరిశీలన బాధ్యతలు ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు అప్పగించామని తెలిపారు. 2010 నుంచి 2016 మధ్య కాలంలో ఆధార్ తీయించుకున్న ప్రతి ఒక్కరూ 2016 తరువాత ఆధార్‌లో పేరు, చిరునామా మార్చుకోని వారు తప్పనిసరన్నారు. 2016 తరువాత ఫొటో, జనన తేదీని మార్చుకున్నా చిరునామా మార్చుకోని వారు అప్‌డేట్ చేయించుకోవాల్సిందేనని తెలిపారు.



వేణుగోపాల్ నగర్‌లోని సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్న డీఎల్‌డీఓ ఓబుళమ్మ

ముందస్తు ఉగాది వేడుకలు

రాప్తాడు: తెలుగింటి లోగిళ్లల్లో కొత్త కాంతులు తెచ్చే పండగ ఉగాది. మండలంలోని ప్రతి ఒక్కరూ ఉగాది పండుగ శుభాకాంక్షలు చెప్పుకోవడంతో ప్రతి తెలుగువారి ఇంట ఆనందం విరబూస్తుంది. ఇళ్లు, వాకిళ్లకు వేప పూత మండలు, మామిడి తోరణాలు కట్టి, కొత్త బట్టలు ధరించి ఉగాది పండుగను జరుపుకుంటారు. ప్రతి ఇంటి ముంగిట్లో మహిళలు శోభకృత నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపేలా రంగవల్లులతో కళ్ల కింపుగా తీర్చిదిద్దుతారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాల్లో పూజలు చేస్తారు.

ముందస్తు ఉగాది వేడుకలు: రాప్తాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో ముందస్తు ఉగాది వేడుకలను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినులు రంగుల ముగ్గులు వేశారు. విద్యార్థులు 'జెడ్పీహెచ్‌ఎస్ ఆర్పీడీ ఉగాది' అంటూ కింద కూర్చొని వినూత్న ప్రదర్శన ఇచ్చారు. అనంతరం విద్యార్థులు తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పండుగను పురస్కరించుకొని వివిధ రకాల పండ్లు, సామగ్రి, దుస్తుల కొనుగోళ్లు ఇతర వ్యాపార కోసం వచ్చిన గ్రామీణులతో మంగళవారం రాప్తాడు సందడిగా కనిపించింది.



జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉగాది అక్షరాల రూపంలో కూర్చొని విద్యార్థుల వినూత్న ప్రదర్శన

రెండో విడత యంత్రసేవపై దృష్టి

- నెలాఖరులోపు గ్రూపు వాటాలు కట్టించాలి

అనంతపురం అగ్రికల్చర్: వైఎస్సార్ యంత్రసేవ పథకం కింద రెండో విడత పంపిణీపై దృష్టి సారించాలని, రైతు గ్రూపులకు ట్రాక్టర్లు, ఆధునిక సామగ్రి అందించడానికి వీలుగా నెలాఖరులోపు గ్రూపు వాటా మొత్తం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశించారు. మంగళవారం ఆయన విజయవాడ నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొదటి విడత కింద 219 ఆర్‌బీకేలకు అనుబంధంగా కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) ఏర్పాటు చేశారన్నారు. జిల్లాలో ఇంకా 232 ఆర్‌బీకేలకు అనుబంధంగా రెండో విడతగా సీహెచ్‌సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆర్‌బీకే వారీగా రైతుగ్రూపులు ఏర్పాటు చేసి సహకార బ్యాంకుల్లో ఖాతాలు కూడా తెరచినట్లు డీఏఓ బి.చంద్రానాయక్ తెలిపారు. పథకం కింద రూ.15 లక్షలు విలువ చేసే ట్రాక్టర్లు, ఇతర ఆధునిక పరికరాలు అందిస్తామన్నారు. ఇందులో రైతులు మొదట 50 శాతం చెల్లిస్తే... అందులో గరిష్టంగా 40 శాతం రాయితీ రూపంలో తిరిగి ప్రభుత్వం నుంచి రైతు గ్రూపు ఖాతాల్లోకి జమ చేస్తారని వివరించారు. మిగిలిన 50 శాతం బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం ఉంటుందని తెలిపారు. రబీ పంట స్థితిగతులు, ఈ-క్రాప్, ఈకేవైసీ, అలాగే ఇటీవల సంభవించిన ఈదురుగాలులు, వడగండ్లవాన కారణంగా దెబ్బతిన్న పంటలకు సంబంధించి పారదర్శకంగా పంటనష్టం అంచనాలు వేసి పంపాలని ఆదేశించారు. ఈ మేరకు ఉద్యానశాఖ జిల్లా అధికారి బి.రఘునాథరెడ్డికి పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డివిజన్ ఏడీఏలు, టెక్నికల్ ఏఓలు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఏఓ చంద్రా నాయక్, డీహెచ్‌ఓ రఘునాథరెడ్డి, ఏడీఏలు

ప్రజా జాతీయవాదాన్ని అందరూ సమర్థించాలి

- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

అనంతపురం కల్చరల్: దేశాన్ని అధోగతి పాలు చేసే మత సంస్కృతిని వీడి ప్రజా జాతీయవాదాన్ని సమర్థించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. ప్రముఖ కథా రచయిత సింగమనేని నారాయణ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి అనంతపురంలోని లలితకళాపరిషత్తులో ఏర్పాటు చేసిన 'సాహిత్య సాంస్కృతిక రంగాల్లో సవాళ్లు - ప్రశ్నించే గొంతుకల అణచివేత' అంశంపై స్మారకోపన్యాసానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సింగమనేని స్మారక కమిటీ కన్వీనర్ ఎస్‌ఎం బాషా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా సింగమనేని చిత్రపటానికి ఆచార్య రాచపాలెం చంద్రశేఖరెడ్డి, డాక్టర్ గేయానంద్, సీపీఎం నాయకులు రాంభూపాల్, డాక్టర్ ప్రసూన, ఐద్వా సావిత్రి తదితరులు నివాళులర్పించారు. అనంతరం రాఘవులు మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ అనుసరిస్తున్న విధానాలను ఘాటుగా విమర్శించారు. దేశ సంస్కృతిని చిన్నాభిన్నం చేస్తున్న పాలకుల తీరును ప్రశ్నించే మేధావులను, దళిత, బహుజన, మైనార్టీలను కేంద్ర ప్రభుత్వం దారుణంగా హింసిస్తోందంటూ మండిపడ్డారు. సీబీఐ, ఈడీను తన జేబు సంస్థలుగా మోదీ మార్చుకుని వ్యతిరేకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో దేశభద్రతకు అందరినీ ఏకం చేసే ప్రజా జాతీయవాదం అత్యవసరమన్నారు. నిబద్ధత కలిగిన సింగమనేని నారాయణ కేవలం సాహిత్యానికే పరిమితం కాకుండా ప్రజా చైతన్యం తెచ్చే ఉద్యమాలలో కీలక పాత్ర పోషించారని, ఆయన సిద్ధాంతాలను, ఆశయాలను అనుసరించడమే మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో ఎల్కేపీ కార్యదర్శి పద్మజ, డాక్టర్ ప్రగతి, పలువురు రచయితలు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీవీ రాఘవులు

బాధితులకు సత్వర న్యాయం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీసు శాఖ చేపట్టిన 'బాధితుల ఆధారిత పోలీసింగ్' ద్వారా బాధితులకు సత్వర న్యాయం అందుతోందని ఎస్పీ ఫక్కీరప్ప తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాధిత కుటుంబాల పక్షాన నిలిచి సత్వరమే ప్రభుత్వ ఆర్థిక పరిహారం అందించేందుకు 'బాధితుల ఆధారిత పోలీసింగ్' సేవలను ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో కుటుంబ పెద్ద దిక్కు కోల్పోయిన 19 కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం ద్వారా బాసటగా నిలిచామన్నారు. ప్రభుత్వం తరఫున ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.1.45 కోట్లు పరిహారం అందించామని వెల్లడించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లాలో రైతు ఆత్మహత్యలకు సంబంధించి 16 కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ కేసుల్లో ఇతర ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేసుకుని ఒక్కో కుటుంబానికి రూ.7 లక్షల పరిహారం కోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

క్రీడలతో శారీరక మానసిక దృఢత్వం



క్రీడలను ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూ వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: క్రీడలతోనే శారీరక మానసిక దృఢత్వం సాధ్యమని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అన్నారు. మంగళవారం జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల 76వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బోధన, బోధనేతర, విద్యార్థుల మధ్య క్రీడాపోటీలు నిర్వహించారు. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సుజాత, ఫిజికల్ డైరెక్టర్ బి. జోజిరెడ్డి ఆధ్వర్యంలో వార్షిక అథ్లెటిమీట్ చేపట్టారు. యూజీ, పీజీ , ఎంబీఏ, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల నుంచి వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన గౌరవ వందనం స్వీకరించారు. క్రీడా జ్యోతి వెలగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్రీడలతో సామాజిక స్పృహ, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు అలవడతాయన్నారు. రోగ నిరోధక శక్తి మెరుగుదలకు, ఏకాగ్రత పెంపొందించుకోవడానికి క్రీడల్లో పాల్గొనాలన్నారు. రన్నింగ్, షాట్‌పుట్, లాంగ్‌జంప్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు.

- టీచింగ్ స్టాఫ్ మెన్ 100 మీటర్ల పరుగు పందెంలో ప్రొఫెసర్ సి.శశిధర్ (జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్) మొదటి స్థానం దక్కించుకుని బంగారు పతకాన్ని స్వీకరించారు.
- రెండో స్థానంలో డాక్టర్ ఏపీ శివకుమార్ దక్కించుకోగా, రజతం పతకాన్ని స్వీకరించారు.
- మూడో స్థానంలో డాక్టర్ జే. శ్రీనివాసులు నిలువగా, కాంస్యం పతకాన్ని దక్కించుకున్నారు.
- పరుగు పందెంలో స్టాఫ్ ఉమెన్ 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో ప్రొఫెసర్ ఆర్ .భవానీ (బంగారు పతకం), రెండో స్థానంలో ప్రొఫెసర్ ఎస్ .వైశాలి (రజతం), మూడో స్థానంలో డాక్టర్ కే.మాధవి (కాంస్యం) పతకాలను దక్కించుకున్నారు. జేఎన్‌టీయూ అనంతపురం రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

24న అంతర్జాతీయ టీబీ దినోత్సవ ర్యాలీ

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ నెల 24న అంతర్జాతీయ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 8 గంటలకు స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి ప్రారంభమవుతుందన్నారు. అనంతరం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

పండ్ల వ్యాపారుల ఘర్షణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక చంద్ర హాస్పిటల్ సమీపంలో పండ్ల వ్యాపారులు మంగళవారం ఘర్షణ పడ్డారు. నడిరోడ్డుపై ఇరువర్గాలు దాడి చేసుకోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. అయితే ఓ వర్గం పోలీసుస్టేషన్‌కు వెళ్లగా మరో వర్గం వెళ్లలేదు. తమ బంధువు చెన్నకేశవపై ఎవరో దాడి చేశారని తెలుసుకుని అతని బంధువులు ఓబుళపతి, చంద్రశేఖర్ ఘటనాస్థలానికి చేరుకోగా, మరో వర్గం మళ్లీ దాడికి వచ్చారని భావించి రాళ్లతో పరస్పరం దాడి చేసుకున్నారు. దీంతో ఇరు వర్గాలను త్రీటౌన్ పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈదాడిలో తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రి తరలించారు. చెన్నకేశవ తలకు తీవ్రమైన గాయమైంది. దీంతో అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరగాళ్ల ఫోన్ నంబర్లు ఇవ్వండి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: సైబర్ నేరగాళ్ల ఆటకట్టించేందుకు 'అనంత' పోలీసులు మరో ముందడుగు వేశారు. బాధితులకు ఏ నంబరు నుంచి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారో.. ఆ నంబర్లను పోలీసులకు తెలపాలని ఎస్పీ ఫక్కీరప్ప సూచించారు. అలాగే 1930 నంబరుకు ఫోన్ చేసి సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరగాళ్ల కాంటాక్ట్ నంబర్లతో పాటు వారి ఫోన్లను కూడా బ్లాక్ చేయిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు సైబర్ నేరగాళ్లకు చెందిన 507 ఫోన్ నంబర్లతో పాటు ఐఎంఈఐ నంబర్లను బ్లాక్ చేయించినట్లు వెల్లడించారు.

బాధ్యతగా పని చేయండి

అనంతపురం క్రైం: విధి నిర్వహణలో బాధ్యతగా పని చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం నగరపాలక సంస్థలోని కౌన్సిల్ హాల్‌లో వివిధ విభాగాల సెక్షన్ హెడ్స్, సూపరింటెండెంట్లు, తదితర సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు.ఆడిట్‌కు సంబంధించి రికార్డులు, ఫైళ్లను జాప్యం చేయకుండా సంబంధిత ఆడిట్ అధికారులకు అందజేయాలన్నారు. ఆడిట్ పట్ల నిర్లక్ష్యంగా ఉంటే మూల్యం చెల్లించుకుంటారన్నారు. కోర్టు కేసులు, ఆర్‌టీఐ సమాచారంపై నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. ఏసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఆర్‌ఓలు సతీష్, సుజాత, ఆర్‌ఐలు మురళి పాల్గొన్నారు.

విధుల్లో జవాబుదారీగా వ్యవహరించాలి

- ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప ఆదేశం



ఎస్పీతో సివిల్‌కు కన్వర్షన్ అయిన కానిస్టేబుళ్లు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ప్రజలు, విధుల పట్ల జవాబుదారీగా వ్యవహరించాలని కానిస్టేబుళ్లకు ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప ఆదేశించారు. ఏఆర్ నుంచి సివిల్‌కు కన్వర్షన్ అయిన ఏడుగురు కానిస్టేబుళ్లు ఎస్పీ ఫక్కీరప్పను మంగళవారం తన ఛాంబర్‌లో కలసి పుష్పగుచ్ఛం అందించారు. ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయాలన్నారు. అప్పుడే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఎస్పీని కలసి వారిలో అడహక్ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఉద్యోగులు వర్క్ టూ రూల్



సాయంత్రం విధులు ముగించుకుని వెళ్తున్న ఉద్యోగులు

అనంతపురం అర్బన్: ఏపీ జేఏసీ అమరావతి చేపట్టిన ఆందోళనలో భాగంగా రెవెన్యూ, ఇతర ఉద్యోగులు మంగళవారం వర్క్ టూ రూల్ పాటించారు. సాయంత్రం 5 గంటలకు విధులు ముగించారు. జేఏసీ జిల్లా చైర్మన్ దివాకర్‌రావు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం కోశాధికారి మారుతీప్రసాద్‌రెడ్డి, తదితరులు కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దారు, నీటి పారుదల, సహకార, ఖజానా, సర్వే భూ రికార్డులు, జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయాలకు వెళ్లి ఉద్యోగులతో మాట్లాడారు. డిమాండ్ల సాధనకు చేపట్టిన ఆందోళనకు సహకరించాలని ఉద్యోగులకు వారు సూచించారు.

'డౌన్ సిండ్రోమ్'పై అవగాహన


అనంతపురం సప్తగిరి సర్కిల్: లోపాలతో పుట్టిన పిల్లలు సమాజంలో ఎలాంటి వివక్షకు గురికాకుండా కాపాడుకోవాలని, తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే సాధారణ పిల్లల్లాగే రాణిస్తారని చిన్న పిల్లల వైద్యనిపుణులు శ్రీవిద్య, డాక్టర్ నారాయణస్వామి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా త్వరిత చికిత్స కేంద్రంలో డౌన్ సిండ్రోమ్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్య నిపుణులు శ్రీవిద్య, మేనేజర్ రజిత పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో చీరల పంపిణీ

అనంతపురం కల్చరల్: వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ ఆర్థిక సాయంతో సాయిట్రస్టు ఆధ్వర్యంలో అమ్మఒడి వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు మంగళవారం పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌సాయి, ఎంజీ జస్వంత్‌వ్యాస్ మాట్లాడారు.

శిక్షణ తరగతుల పరిశీలన

అనంతపురం సిటీ: అనంతపురం శివారులోని టీటీడీసీలో జరుగుతున్న ఆపదమిత్రల శిక్షణ తరగతులను జిల్లా పరిషత్ సీఈఓ భాస్కర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు మంగళవారం పరిశీలించారు. ఆపద మిత్రలకు తమ సందేశాన్నిచ్చారు. తమ తమ ప్రాంతాల్లో సంభవించే ఆపద సమయాల్లో తక్షణం ఎలా స్పందించాలనే అంశాలను వివరించారు. సేవాభావంతో పని చేయాలని సూచించారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220719, 9912220732, 9912220724, 9010223702, 9010567770, 9010588846, 9912220727